بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 17.11.2023 (Telugu)**

# బద్ర్ యుద్ధము గురించి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సంఘటనలు మధ్య తూర్పులో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా మరల దుఆల పిలుపు

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17.11.2023 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, టిల్ఫోర్డ్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ○ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠానానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రవచించిరి.

గత ఖుత్బా చివరలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర గురించి ప్రస్తావిస్తున్న చరిత్రలో ఫరాత్ బిన్ హయాన్ ఇస్లాం స్వీకరించిన విషయం తెలుపబడెను. దాని మరిన్ని వివరములు ఇట్లు గలవు. అతడు బంధించబడిన ఖైదీలలో ఉండెను. బద్ర్ యుద్ధములో కూడ అతడు గాయాల పాలయ్యెను. కాని ఏదో విధంగా అతడు తప్పించుకొని పారిపోయెను. హజ్రత్ అబూబక్ర్ (రజి) అతణ్ణి చూడగానే ఇట్లనిరి. ఇక నువ్వు తన నడవడికను మార్చుకొని ఇస్లాంను స్వీకరించుము. కావున అతడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైపు నడవడం మొదలు పెట్టెను. ఒక అన్సారి దగ్గరి నుండి వెళ్తూ వెళ్తూ నేను ముస్లిం అని అనెను. ఇతడు ఇస్లాంను స్వీకరించాడని ఆ అన్సారి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు చెప్పెను. వారు స.అ.స. ఇట్లనిరి. అతడు ఇస్లాంను స్వీకరించాడని అతడే చెప్పినచో ఇక ఈ విషయము అతనికి మరియు అల్లాహ్‌కు తెలుసు. అనంతరం మహా ప్రవక్త ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతణ్ణి విడుదల చేసిరి.

జమాదిఉల్ ఆఖర్ మూడు హిజ్రి సం॥లో ఖరదహ్ ప్రాంతమునకు పంపబడిన సర్‌య హజ్రత్ జైద్ బిన్ హార్స (రజి) ప్రస్తావన సంఘటనలలో లభిస్తుంది. ఈ సంఘటనను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాసిరి. బనూసులైమ్, బనూ ఘత్ఫాన్ దాడుల నుండి కొంచెం విరామం లభించినప్పుడు ముస్లింలు మరో ప్రమాదమును ఎదుర్కొనుటకు తమ దేశం నుండి బయలు దేరవలసి వచ్చెను. ఇప్పటి వరకు ఖురైష్‌లు తమ వ్యాపారం కొరకు హిజాజ్ తీర మార్గము నుండి సిరియాకు వెళ్లేవారు. కాని వారు ఈ మార్గమును విడిచి పెట్టిరి. ఎందుకనగా ఈ ప్రాంత తెగలు ముస్లిం మిత్ర పక్షంగా మారెను. అందుకే వారు నజ్ద్ మార్గంను ఎన్నుకొనిరి. ఇది ఇరాఖ్‌కు చేరుకొనును. దీని చుట్టు ముస్లిం ప్రాణ శత్రువులైన సులైమ్, ఘత్ఫాన్ ఉండిరి. ఖురైష్‌ల ఒక బృందం నజ్ద్ మార్గం గుండా వెళ్లబోతుందని జమాదిఉల్ ఆఖర్ నెల చివరలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు సమాచారం అందెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమాచారం అందగానే జైద్ బిన్ హార్స (రజి) నాయకత్వంలో తమ అనుచరుల ఒక సైన్యంను పంపించిరి. జైద్ (రజి) ఎంతో చలాకీతనంతో తమ

కర్తవ్యంను నెరవేర్చిరి. నజద్ మార్గంన ఖరదహ్ ప్రాంతంలో వారిపై దాడి చేసిరి. ఈ ఆకస్మిక దాడితో భయపడి ఖురైష్‌లు తమ ధనం, వస్తువులను వదిలి పారిపోయిరి. జైద్ బిన్ హార్స (రజి) అధిక మొత్తంలో శత్రువుల ధనము తీసుకొని విజయవంతంగా మదీనాకు తిరిగి చేరుకొనిరి.

కాబ్ బిన్ అష్రఫ్ హత్యకు సంబంధించిన మరొక సంఘటన గలదు. అతడు మదీనా నాయకులలో పరిగణించబడేవాడు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒప్పందంలో పాల్గొనెను. బుఖారి (హదీస్ పుస్తకం)లో ఇట్లు గలదు. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాబ్ బిన్ అష్రఫ్ సమస్యను ఎవరు ముగిస్తారు? అని అడుగుతు ఇట్లనిరి. అతడు అల్లాహ్, అతని ప్రవక్తకు తీవ్ర దుఃఖం కలిగించెను. ముహమ్మద్ బిన్ ముస్లిమ (రజి) నిలబడి నేను అతణ్ణి హతమార్చుతానని అనిరి. వారొక సాకుతో కాబ్ వద్దకు వచ్చి ఇట్లనిరి. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మాతో దానమడుగుతు మమ్ములను ఇబ్బందికి గురి చేస్తున్నారు. నీతో అప్పు తీసుకోవడానికి నేను నీ వద్దకు వచ్చాను. మీరు అతనితో విసిగిపోయి అతణ్ణి విడిచి పెట్టే రోజు ఎంతో దూరము లేదని అతడనెను. అప్పు కావాలంటే తమ స్త్రీలను లేదా తమ కుమారులను నా వద్ద కుదువ పెట్టండని కూడ అనెను. బదులుగా ముహమ్మద్ బిన్ ముస్లిమ (రజి) ఇట్లనిరి. ఇది అసాధ్యము, కాని మేము మా రక్షణ కవచాలను నీ వద్ద కుదువ పెట్టగలము. అందుకు కాబ్ రాజీ పడెను. రాత్రి పొద్దు పోయాక వారు తిరిగి కాబ్ ఇంటికి చేరుకొని, అతణ్ణి తమ ఇంటి నుండి బయటికి పిలిపించుకొని, ఎంతో వేగంగా అతణ్ణి వశపర్చుకొని హత్య చేసిరి.

దీని మరిన్ని వివరములు ఇట్లు గలవు. షరహ్ బుఖారి షరహ్ ఉమ్దతుల్ ఖారీలో ఇట్లు గలదు. ముహమ్మద్ బిన్ ముస్లిమ తమ సహచరులతో కలిసి కాబ్‌పై దాడి చేసి, అతణ్ణి హతమార్చిరి. వారి ఒక సహచరుడు హజ్రత్ హారిస్ బిన్ ఔస్‌కు ఖడ్గ మొన తగిలి గాయపడిరి. వారు తమ సహచరుల ఖడ్గ మొన తగిలే గాయపడిరి. కావున వారి సహచరులు వారిని ఎత్తుకొని వేగంగా మదీనాకు చేరుకొని, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హాజరైరి. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ హారిస్ బిన్ ఔస్ గాయంపై తమ నోటి ఉమ్ము పెట్టిరి, అనంతరం వారికెన్నడు బాధ కలుగలేదు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాసిరి. కాబ్ హత్య వార్త వ్యాపించగా యూదుల ఒక బృందం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, మా నాయకుడు ఇలా హత్య చేయబడెనని ఫిర్యాదు చేసెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సంక్షిప్తంగా కాబ్ వాగ్దాన భంగం, యుద్ధంను ప్రేరేపించుట, కుట్రలకు పాల్పడుట, దూషణలు, తనను హత మార్చు కుట్ర మొదలగు చర్యలను గుర్తు చేయించిరి. అప్పుడు వారు భయపడి మౌనం వహించిరి. వారి అంగీకారంతో భవిష్యత్తు కొరకు మరొక క్రొత్త ఒప్పందం వ్రాయబడెను. మోసములు, కుట్రల పద్ధతుల నుండి దూరముంటామని యూదులు క్రొత్త ఒప్పందం వ్రాసిరి.

దీని తర్వాత కాబ్ బిన్ అష్రఫ్ హత్య గురించి యూదులు మరెప్పుడైనా ప్రస్తావించినట్లు లేదా ముస్లింను ఆరోపించినట్లు చరిత్రలో ఎక్కడా వ్రాసి లేదు. ఎందుకనగా కాబ్ ఇదే శిక్షకు అర్హుడని వారి మనసులు కూడ భావిస్తుండెను.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇది అధర్మంగా చేయించిన హత్య అని కొందరు

చరిత్రకారులు ఆరోపిస్తుంటారు. కాని ఇది అధర్మంగా చేసిన హత్య కాదని గుర్తుంచుకోగలరు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కాబ్ బిన్ అష్రఫ్ శాంతి ఒప్పందం చేసుకొనెను. ముస్లింలకు విరుద్ధంగా చర్యలకు పాల్పబడుటను అటుంచితే బయటి శత్రువుకు వ్యతిరేకంగా ముస్లింలకు సహకరిస్తానని, ముస్లింలతో స్నేహపూర్వక సంప్రదింపులు కలిగి ఉంటానని అతడు ప్రతిజ్ఞ చేసెను. కాని అతడు ముస్లింల పట్ల తిరుగుబాటుకు పాల్పడెను. కుట్రలు, పీడనమునకు పాల్పడి యుద్ధం జరగాలని కృషి చేసెను, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హత్యకు ప్రణాళిక రచించెను. అతని నేరముల వలన అతణ్ణి శిక్షించుటకు ఈ చర్య చేపట్టబడెను. వాస్తవంగా నాగరికత కలిగిన దేశములనబడుతున్న దేశాలలో తిరుగుబాటు, వాగ్దాన భంగం, ప్రేరణ, యుద్ధం, కుట్రల నేరస్తులకు శిక్షలు విధించబడుతున్నవి. అలాంటప్పుడు విమర్శించే హక్కు ఎక్కడిది? ప్రస్తుతం పాలస్తీనా మరియు ఇజ్రాయిల్ మధ్య ఎన్నో రెట్లు ఎక్కువ జరుగుతుంది. ఏ విధంగాను ఇది ధర్మం కాదు.

మౌనంగా అతణ్ణి హత్య చేయుట గురించి రెండవ ప్రశ్న ఎదురగుతుంది. అరబ్‌లో అప్పుడు ప్రతి వ్యక్తి, తెగ స్వతంత్రంగా, స్వీయ అధికారిగా ఉండెను. ఇటువంటి పరిస్థితిలో కాబ్‌కు వ్యతిరేకంగా వాజ్యము వేయించి అధికారికంగా హత్య శిక్ష ఆదేశము ఏ న్యాయస్థానంలో పొందే అవకాశముండెను? ఒప్పందం ప్రకారం సకల వివాదములు, రాజకీయ అంశాలలో సముచిత నిర్ణయం తీసుకోగలరని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అధికారం ఇవ్వబడెను. కావున వారు స.అ.స. దేశ శాంతి దృష్ట్యా కాబ్ మోసాల వలన అతనికి మరణ శిక్ష విధించినచో వారి నిర్ణయంను న్యాయస్థాన స్థాయిలో విమర్శించే హక్కు ఎవరికున్నది. పైగా స్వయంగా యూదులు కూడ కాబ్ నేరాల వలన అతనికి ఇదే శిక్ష సముచితమని భావించి మౌనం వహించిరని చరిత్రతో రుజువైనను దీనిని ఎలా విమర్శించగలరు.

హుజూర్ ఇట్లనిరి. ఇదే కాలంలో హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె అయిన హజ్రత్ హఫ్స (రజి) రెండవ వివాహం జరిగింది. ఒక వినమ్రులైన అనుచరులు ఖునైస్ బిన్ హుజాఫా (రజి) సతీమణిగా ఆమె ఉండిరి. వారి భర్త బదర్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన తర్వాత అనారోగ్యానికి గురై కోలుకోలేక మృతి చెందిరి. అనుకోకుండా మృతి చెందినందున హజ్రత్ హఫ్స (రజి)కు తీవ్ర బాధ కలిగెను, హజ్రత్ ఉమర్ (రజి)తో సంబంధంను దృఢపర్చుకొనుటకు, హజ్రత్ హఫ్స (రజి)కు చదవడం, వ్రాయడం వచ్చిన ప్రత్యేకత వలన ప్రచారం, శిక్షణలో విస్తృత స్థాయిలో పనులు చేయవచ్చుననే ఉద్ధేశంతో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి మూడవ సం॥ షాబాన్ నెలలో వారితో నికాహ్ చేసుకొనిరి. హజ్రత్ హఫ్స (రజి) సుమారు 63 సం॥ల ఆయువు పొంది హిజ్రి 45వ సం॥లో మృతి చెందిరి.

హిజ్రి రెండవ సంవత్సర సంఘటనలలో హజ్రత్ అలీ (రజి) మరియు హజ్రత్ ఫాతిమా (రజి) వివాహ ప్రస్తావన జరిగింది. వారికి పది నెలల తర్వాత హిజ్రి మూడవ సం॥ రమజాన్ నెలలో ఒక బాలుడు జన్మించెను. అతనికి హసన్ (రజి) అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నామకరణం చేసిరి. హసన్ (రజి) గురించి ఒకసారి వారు స.అ.స. ఇట్లనిరి. నా ఈ బాలుడు సయ్యద్ అనగా నాయకుడు. అల్లాహ్ తఆలా ఇతని ద్వారా ముస్లింల రెండు వర్గముల మధ్య సంధిని కుదుర్చును. అనంతరం ఈ భవిష్యవాణి నిర్ణీత కాలంలో పూర్తి అయినది.

ఖుత్బా చివరలో పాలస్తీనా ముస్లింల కొరకు దుఆ చేయాలని మరల పిలుపునిచ్చిరి.

నేను చాలా ఖుత్బాల నుండి పాలస్తీనీయుల కొరకు దుఆల పిలుపునిస్తున్నాను. నేడు కూడ దీని గురించి చెప్పదలచితిని. దుఆలను కొనసాగించండి. ఇప్పుడైతే దౌర్జన్యము మితిమీరిపోయింది. హమాస్‌తో యుద్ధం పేరున అమాయక పిల్లలు, స్త్రీలు, వృద్ధులు, రోగులను హతమారుస్తున్నారు. ఈ నామమాత్రపు నాగరికత గల ప్రజలు అన్ని రకాల యుద్ధ నియమ, నిబంధనలను విస్మరించారు. ముస్లిం దేశాలకు కూడ అల్లాహ్ తఆలా సద్బుద్ధి ప్రసాదించుగాక! 72, 73 సం॥ల క్రితం ముస్లింలు ఏకం కావాలని హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) పిలుపునిచ్చిరి. ఒక్కటి కాకుండా ఒక్కొక్కరు తమను నాశనం చేసుకుంటారా లేక ఒక్కటై తమ ఉనికిని నిలబెట్టుకొని, మనుగడ సాగించాలో వారు నిర్ణయించుకోవలెను. ఇప్పటికైనా వారీ విషయంను అర్థం చేసుకొని ఒక్కటైనచో బాగుండును. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంద నగా ఉమ్రాహ్‌కు వెళ్తున్న ప్రజలు అక్కడ పాలస్తీనా లేదా ఇజ్రాయిల్ యుద్ధం గురించి ఏమియును మాట్లాడకూడదని చెప్పబడుతుందని నాకు ఎవరో తెలిపారు. వీజా జారీ చేస్తున్నప్పుడు అక్కడి ప్రభుత్వం ఇలాంటి సూచనలిస్తుంది. ఇది నిజమైనచో ముస్లిం ప్రభుత్వాలు అతి పిరికితనంను ప్రదర్శిస్తున్నాయి. సారాంశమేమనగా ఉమ్రాహ్ ప్రార్థన హక్కును చెల్లించాలి. అప్పుడు ఎలాంటి విషయాలను మాట్లాడ కూడదు. కాని పీడిత పాలస్తీనీయుల కొరకు అక్కడ తప్పకుండా దుఆ చేయవలెను. వెళ్తున్నవారు ఈ దుఆలను కూడ గుర్తుంచుకున్నచో బాగుండును.

ప్రస్తుతం ముస్లిం ప్రభుత్వాలు నిరసన తెలుపుతు బలహీనంగా మాట్లాడుతున్నాయి. కొన్ని నిరసలు వెలువడినవి. కాని ఇంతకంటే గట్టిగా కొందరు ముస్లిమేతరులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు నిరసన తెలిపెను. అల్లాహ్ తఆలా ముస్లింలకు ధైర్యము, వివేకం కలిగించుగాక! ఐక్య రాజ్య సమితి కార్యదర్శి కూడ మంచిగానే మాట్లాడుతున్నారు. ప్రస్తుతం వారు చాలా మంచిగా వ్యాఖ్యానిస్తున్నారు. కాని వారి పిలుపునకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఒక వేళ ఈ యుద్ధం మరింత విస్తరించి, ప్రపంచ యుద్ధంగా మారినచో యుద్ధం ముగిసిన అనంతరం ఐక్య రాజ్య సమితి కూడ ఉనికి కోల్పోతుందని అనిపిస్తుంది. అల్లాహ్ తఆలా ప్రపంచానికి తెలివి తేటలు ప్రసాదించుగాక! ప్రపంచం తమ వినాశనానికి మరింత సమీపిస్తుందని అనిపిస్తుంది. ఈ వినాశనం తర్వాత మిగిలిన ప్రజలకు అల్లాహ్ తఆలా తెలివి తేటలు ప్రసాదించుగాక! వారు అల్లాహ్ తఆలా వైపు దృష్టి సారింతురు గాక! అతని వైపు తిరిగి వత్తురు గాక! సారాంశమేమనగా మనము ఇందుకు చాలా దుఆలు చేయవలెను. అల్లాహ్ తఆలా ప్రపంచంను కరుణించుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*